

ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ, ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

మన్సూరాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పార్కులు, కమ్యూనిటీ హాలుల వద్ద ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ సూచించారు. డివిజన్ పరిధిలోని మమతానగర్ రోడ్డు నంబర్.1/ఈలో రూ.10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యానాయక్, కాలనీ సభ్యులతో కలిసి కార్పొరేటర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందికి మానసిక ఒత్తిడి, శారీరక సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని అధిగమించాలంటే వాకింగ్, యోగా, వ్యాయామాలు వంటివి తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షులు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి సురేఖ, సభ్యులు శ్రీనివాస్, రామ్మోహన్, కార్తీక్, మహేష్ శెట్టి, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

నాలా విస్తరణ పనులు పూర్తి చేయాలి: కార్పొరేటర్

చంపాపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): నాలా విస్తరణ పనులను త్వరగా చేపట్టి పూర్తి చేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌కాలనీలో శనివారం ఆయా శాఖల అధికారులతో కలిసి ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నాలాలు పొంగకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నాలాను కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. నాలాలకు ఉన్న ఆటంకాలన్నీ తొలిగితే చాలా వరకు ముంపు సమస్య తలెత్తదని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, టీపీఎస్ అర్చన, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు దశరథ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

హయత్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి శనివారం పర్యవేక్షించారు. కాలనీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దుర్గానగర్‌కాలనీలో పూర్తి స్థాయి డ్రైనేజీ ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేయించడం జరిగిందని తెలిపారు. నిధుల కొరత కారణంగా కొంత వరకు డ్రైనేజీ లైను ఏర్పాటుకు అవకాశం కలిగిందన్నారు. త్వరలో మిగిలిన పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన పీసరి శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 2026విద్యా సంవత్సరానికి గాను అర్హులైన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 50శాతం, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. డిగ్రీ కళాశాలలో బోధనానికి తగిన అనుభవం కలిగి ఉండాలి.

ఖాళీల వివరాలు..

టీపీఏ-1, బోటనీ-1, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్-4, సంస్కృతం-1, స్టాటిస్టిక్స్-1, జువాలజీ-1లలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు జూలై 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్

ఎల్బీనగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఎల్బీనగర్ ఎస్‌బీహెచ్ వెంచర్3లో నిర్మాణదశలో ఉన్న సీసీరోడ్డు పనులను కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. కాలనీలోని రోడ్డు నంబర్ 1,2,3,4,5లలో సుమారు రూ.72లక్షలతో సీసీరోడ్డు పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే రెండు రోడ్లలో పనులు పూర్తి కాగా మరో మూడు రోడ్లలో పనులు జరుగుతున్నాయని అవి కూడా మరో రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలచందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్, రామోజీ పాల్గొన్నారు.



బ్యాగులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ ఫర్ సేవా క్లస్టర్ కో-ఆర్డినేటర్ చరణ్ ప్రసాద్ మాట్లాడుతూ రూ. వెయ్యి విలువైన బ్యాగులను 50మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూత్ ఫర్ సేవా ప్రతినిధులకు హెచ్‌ఎం యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు డాక్టర్ శ్రీనివాస్, లోకేష్, స్వామి, కిరణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చంపాపేటలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో బోనమెత్తిన విద్యార్థినులు, లెక్చరర్లు



బోనాల వేడుకల్లో జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్ విద్యార్థుల విన్యాసాలు



బోనమెత్తుకుని ఊరేగింపుగా వెళ్తున్న దిల్‌సుఖ్‌నగర్‌లోని హైందవి డిగ్రీ కళాశాల విద్యార్థినులు



పోతరాజులు, శివసత్తుల ప్రదర్శనల నడుమ పోచమ్మ తల్లికి పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న దుర్గాదేవి ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్

విద్యాలయాల్లో ఘనంగా బోనాల సంబరాలు

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్‌లో శనివారం ఆషాఢ బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు కలిసి బోనాలు తయారు చేయగా, విద్యార్థులు పోతరాజుల విన్యాసాలతో సందడి చేశారు. అనంతరం స్థానిక ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ మరియన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో..

సైదాబాద్ : బోనాల ఉత్సవాన్ని శనివారం చంపాపేటలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థులు, లెక్చరర్లు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తెలంగాణ సంప్రదాయ దుస్తులు ధరించి డప్పుల నడుమ బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివెళ్లి చంపాపేటలోని పోచమ్మ ఆలయంలో బోనం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు మన సంప్రదాయాలతో పాటు సంస్కృతి, వారసత్వంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

హైందవి డిగ్రీ కళాశాలలో..

చాదర్‌ఘాట్ : ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను దిల్‌సుఖ్‌నగర్‌లోని హైందవి డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో బోనమెత్తుకున్నారు. కళాశాల నుంచి ఊరేగింపుగా సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కళాశాల చైర్మన్ గడ్డం శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ప్రిన్సిపాల్ ప్రియతో పాటు విద్యార్థినులు పెద్దఎత్తున పాల్గొని బోనాల సంబరాలు జరుపుకున్నారు.

షమ్‌రాక్ హ్యాపీ నెస్ట్ ప్లే స్కూల్‌లో..

వనస్థలిపురం: సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని షమ్‌రాక్ హ్యాపీ నెస్ట్ ప్లే స్కూల్ ఛైర్‌పర్సన్ సంగీతచౌదరి అన్నారు. వనస్థలిపురం కమలానగర్‌లోని షమ్‌రాక్ హ్యాపీ నెస్ట్ ప్లే స్కూల్లో బోనాల ఉత్సవాలు శనివారం కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు బోనాలతో పాటు పోతురాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ఛైర్‌పర్సన్ సంగీతచౌదరి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



షమ్‌రాక్ హ్యాపీ నెస్ట్ ప్లే స్కూల్లో బోనాల ఉత్సవాల్లో పాఠశాల ఛైర్‌పర్సన్ సంగీతచౌదరి తదితరులు

పోచమ్మ తల్లికి పట్టువస్త్రాల సమర్పణ

మన్సూరాబాద్ : మన్సూరాబాద్‌లో ఆదివారం బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయం నుంచి శుక్రవారం రాత్రి పోచమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. కాలనీ అధ్యక్షుడు, దుర్గాదేవి ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ పోచమ్మ తల్లికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఇందులో భాగంగా చేపట్టిన పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దుర్గాదేవి ఆలయ అర్చకులు చల్లా బాల మురళీకృష్ణశర్మ, శ్రీసాయినగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు యాదగిరి, హన్మంతరావు, రమేష్, అశోక్, సత్తిరెడ్డి, మురళి, రవి, లక్ష్మయ్య, అజయ్, కేశవులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : నేటి బోనాల ఉత్సవాలకు మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా రోడ్డులో గల పోచమ్మ తల్లి ఆలయం అన్ని హంగులతో ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి శనివారం పరిశీలించారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి



వినతిపత్రం అందించి కాలనీ సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలియజేస్తున్న విజయగార్డెన్స్ కాలనీ సభ్యులు

మన్సూరాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో బాక్స్‌డ్రైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో చిన్నపాటి వర్షాలకే కాలనీ మొత్తం వరదనీటిలో చిక్కుకుంటోందని, వెంటనే అధిక సామర్థ్యంతో నూతన డ్రైన్‌ను ఏర్పాటు చేయాలని నాగోల్ డివిజన్ విజయగార్డెన్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నాలా వ్యవస్థ సరిగ్గాలేకపోవడంతో వరదనీటితో పాటు మురుగునీరు రోడ్లపైకి పెద్ద ఎత్తున చేరడంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి మల్లారెడ్డి, నర్సింహ చారి, రాజేశ్వర్, సూర్యనారాయణరెడ్డి, అనంతశర్మ పాల్గొన్నారు.

కాలనీ కమాన్‌లతో చిరునామా సులువు

● మాజీ మేయర్ పారిజాతారెడ్డి, బీజేపీ నేత అందెల



లోకాయుక్తకాలనీ స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న పారిజాతారెడ్డి, శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ కొత్తకొత్త కాలనీలు పుట్టుకొస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఏ కాలనీ ఎక్కడుందో తెలుసుకోవడం కష్టతరంగా మారిందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. కాలనీ ప్రధాన రోడ్డులో కమాన్(స్వాగత తోరణం) నిర్మించుకుంటే చిరునామా తెలుసుకోవడం సులువుగా మారుతుందని వారు పేర్కొన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 19వ డివిజన్‌లోని లోకాయుక్త కాలనీలో కొత్తగా నిర్మించిన స్వాగత తోరణాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా చిగిరింత, అందెల మాట్లాడుతూ ఆర్చి నిర్మాణంతో పాటు ప్రతి రోడ్డులో ప్లాట్ల నంబర్లతో కూడిన బోర్డులు కూడా ఏర్పాటు చేసుకుంటే ఇంకా బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శ్రీశైలంచారి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు భాస్కర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, బిట్టు, శంకర్‌రెడ్డి, శశిధర్ రావు, శ్రీనివాస్‌చారి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఏఎంహెచ్‌ఓ నీలిమ, విజయ్‌నేత

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వనస్థలిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు, సామాజిక వేత్త గడ్డె విజయ్‌నేత ఆధ్వర్యంలో ఎన్జీవోస్‌కాలనీ వివేకానంద పార్కు వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యశిబిరంలో జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌ఓ నీలిమతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. సుమారు వంద మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణమూర్తి, నందికొండ రవీందర్‌రెడ్డి, శివ, సాగర్, గిరినేత, అరుణ్, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

చాదర్‌ఘాట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 23న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ వామపక్ష విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేశాయి. విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిచైతన్య జూనియర్ కళాశాల ముందు గ్రేటర్ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్, ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు చైతన్యయాదవ్, పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్, ప్రధాన కార్యదర్శి కె.గణేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న తలపెట్టిన విద్యా సంస్థల బంద్ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నరేష్, ఉదయ్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

చంపాపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లోని సీ బ్లాక్‌లో నివాసం ఉంటున్న ఫారుఖ్ బీన్ మహ్మద్ కూతురు మరియం ఫాతిమా(18) శనివారం ఉదయం 5:30గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఫాతిమా తండ్రి ఫారుఖ్ బీన్ మహ్మద్ కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం : కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తానని బీఆర్‌ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్‌కాలనీలోని అమ్మవారి ఆలయం వద్ద కొన్నాళ్లుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు చింతల రవికుమార్‌ను కోరారు. తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో కలిసి శనివారం ఆ సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన రవికుమార్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు.



అకడమిక్ అచీవర్స్ అవార్డ్స్-2025 గ్రహీతలతో పారిజాతారెడ్డి

పేద విద్యార్థి ఉన్నత చదువుకు 'చిగిరింత' ఆర్థిక చేయూత

సరూర్‌నగర్ : రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆటో డ్రైవర్‌కు మారుడి ఉన్నత విద్యాభ్యాసం కోసం బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి చిరుసాయం చేసి ఆర్థిక చేయూత అందించారు. బడంగ్‌పేట్‌లోని న్యూమాస్టర్ మైండ్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన అకడమిక్ అచీవర్స్ అవార్డ్స్-2025 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీకి చెందిన సాయికుమార్, నవీన్‌కుమార్ అనే విద్యార్థులు ఐఐటీ ధన్‌బాద్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తుండగా, వారికి కళాశాల తరపున రూ.పది వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కాగా నవీన్ కుమార్ తండ్రి(ఆటో డ్రైవర్) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతడు ఎంతో పట్టుదలతో ఐఐటీ చదువుతున్నట్లు తెలుసుకున్న పారిజాతారెడ్డి.. వెంటనే తన వంతు సాయంగా నవీన్‌కు మరో రూ.పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇక సీఏ ఫౌండేషన్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 90శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధించి, స్ఫూర్తి కాలేజీలో బీకాం, బీబీఏ కోర్సుల్లో చేరిన పలువురు విద్యార్థుల ఫీజును మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున చెల్లించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, స్ఫూర్తి కళాశాల సీఈవో హోలీధర్‌రెడ్డి, మాస్టర్ మైండ్స్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి డాక్టర్ పాండు, కామర్స్ హెడ్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్లు నాగేంద్ర, లఖ్‌పతి, బాలాజీ, ప్రిన్సిపాల్స్ నవనీత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శివారులో కురిసిన భారీ వర్షం


● ఎన్‌హెచ్-65పై నిలిచిన వరద నీరు

● కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4గంటలకు ప్రారంభమైన వర్షం ఏకధాటిగా సుమారు గంటన్నర పాటు కురువడంతో వరద నీరు ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాలతో పాటు విజయవాడ జాతీయ రహదారి 65పై అక్కడక్కడ వరదనీరు నిలిచింది. దీంతో ఆ రహదారి చెరువును తలపించింది. జాతీయ రహదారి పెద్దఅంబర్‌పేట్ జేజీబీ జంక్షన్ సమీపంలోని సర్వీసు రోడ్డులో వరద నీరు భారీగా వచ్చి చేరింది. దీంతో ఆ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వరద నీరు భారీగా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు వెనక్కు తిరిగి మరో మార్గంలో వెళ్లారు. దాంతో పాటు బాటసింగారం దేశ్‌ముఖ్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద కూడా భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శివారులోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. వానకాలం ప్రారంభమైన తర్వాత ఇదే పెద్ద వర్షం అని శివారు ప్రజలు, రైతులు తెలిపారు. భారీ వర్షం కురువడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



పెద్దఅంబర్‌పేట్ జేసీబీ జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి 65 సర్వీసు రోడ్డు



పెద్దఅంబర్‌పేట్ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వెనక్కు తిరిగి వెళ్తున్న వాహనాలు



మన్సూరాబాద్ చౌరస్తా నుంచి జీఎస్‌ఐ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో భారీగా వచ్చి చేరిన వరదనీటిలో ఇబ్బందిగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

మన్సూరాబాద్, నాగోల్ ప్రాంతాల్లో..

మన్సూరాబాద్ : మన్సూరాబాద్, నాగోల్ ప్రాంతాల్లో శనివారం మరోసారి వాన దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, బస్తీలు, పలు రోడ్లు వరదనీటితో నిండిపోయాయి. నాగోల్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌చౌరస్తా నుంచి సౌత్‌ఎండ్‌పార్కు కాలనీకి వెళ్లే ప్రధానరోడ్డు మార్గం, శ్రీఇంద్రప్రస్థకాలనీ, అయ్యప్పకాలనీ, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ చౌరస్తా జీఎస్‌ఐ వెళ్లేమార్గం, ఆగమయ్యనగర్‌కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై వరదనీరు వచ్చి చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు.

జేసీబీ జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ జేసీబీ జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక బీజేపీ నాయకుడు పిల్లి శ్రీనివాస్‌యాదవ్ వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లుకు వినతిపత్రం అందజేశారు. సర్వీసు రోడ్డులో పలు వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం కూడా రెండు ద్విచక్ర వాహనదారులు ఎదురెదురుగా ఢీకొని గాయాల పాలయ్యారని తెలిపారు. స్పందించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అక్కడి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రోడ్డుకిరువైపుల సైన్‌బోర్డులు ఏర్పాటు చేయిస్తానని చెప్పినట్లు తెలిపారు. అవసరమైతే ట్రాఫిక్ కానిస్టేబుల్‌లను ఏర్పాటు చేయిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు కట్ట సాయికిరణ్‌గౌడ్, చెట్టుపల్లి అంబేడ్కర్ పాల్గొన్నారు.